పరివర్తనము

శ్రీమతి ఆచంట సత్యవతమ్మగారు

మగఁడు నవనాగరికశిఖామణి. లలిత సనాతనధర్మావలంబిని.

"విగ్రహారాధన, రకరకముల దేవుళ్లు మనకున్నవి గాని దొరలకు, తురకలకు ఉన్నవా? ఒక్కడినే నమ్మినవాళ్ల మనస్సు చెదరదు కాని శివుడని, విష్ణువని, బ్రహ్మని, రాముడని, కృష్ణుడని, పైగా పదిఅవతారముల వేర్వేరు పేర్లని, ఇదిగాక లక్ష్మి, సరస్వతి, పార్వతి, కాళి, దేవి మొదలగు స్త్రీదైవతములు యీలా ఇన్ని దేవుళ్లను కొలిస్తే మనస్సు దేనిమీద నిలుస్తుంది? మీపూజలకు, నోములకు అర్థములేదు. కొబ్బరికాయకు ముక్కుచెవులుపెట్టి వరలక్ష్మి అని పూజ. పసుపుతో ముద్దచేసి గణపతి అని పూజ. చెట్టో కటె పాత పోలకమ్మ అని పూజ. ఇలాంటి వెర్రివెర్రిచేతలచేతనే ఆఇంగ్లీషువాళ్ళు మనలనిచూచి మన పురాణములచరిత్రలు విని చేతకాని వారమని, మూర్ఖులమని, తలతోకలేని కథలు నమ్ముతామని, రావణాసురునికి పదితలలు, శతకంఠరావణునికి నూరుతలలు, కార్తవీర్యార్జునునకు, బాణాసురునకు వెయ్యేసి చేతులని అట్టిరూపము లుద్భవించుట ఆనాడు, ఈనాడు, ఏనాడుకూడ అసంభవమని, మీరు వట్టిపశువులని అనుట సంభవించినది" అని లలితభర్తయగు శ్రీధరరావన్నాడు. తిరిగి అన్నాడు: "పైగా జీవరాసులందరిలోను ఆత్మస్వరూపుడై దేవుడున్నాడని హిందూధర్మముకదా? మానవసేవచేస్తే దేశసేవఅగును. అట్టి దేశసేవచే జీవయాత్రగడిపితే ముక్తిరాదా? అట్టి జడపదార్థముల పూజించి, సంవత్సరము పొడుగున కాలము వ్యర్థముగా గడుపుతే ఏమిలాభము? వ్యర్థకష్టము. శరీరాయాసము. మడితడి అని, పండుగనాడు తెమలక ఆలస్యభోజనములు, గురుత్వము కలిగించు ఆహారములు, వీటిచే అనారోగ్యములు ఇంతేలాభము. మొన్నటిదాకా శ్రావణమాసమంతా మంగళవారములని, శుక్రవారములని, పౌర్ణమని, ఏకాదశని. స్నానములు, ఒంటిపూటతిండి, తడిబట్టతో తంటాలుపడ్డావు. మళ్ళీ దసరా అని, దేవీనవరాత్రులని, తొమ్మిది రోజులు కలశారాధన చేసి దేవీపూజచేయాలని మొదలెట్టుచున్నావు. నీమూలాన్న నాకుకూడా వేళకు తిండిలేదు. ఏమీ యీబట్టతో ముట్టుకోవద్దంటావు. కాఫీ యిచ్చుటకైనా నీకు తీరికఉండదు. ఇల్లంతా గడబిడ."

ఆమాటలకు లలితకు మహాకోపమొచ్చింది. "పెళ్ళయినప్పటినుండి పండుగ, పూజ అంటే మీతో తంటాలు పడుచూ యిల్లాగే వేగుచున్నాను. మీమనసంత పరిపూర్ణజ్ఞానము నాకింకాకలుగలేదు. అయినా నాతంటాలు నేను పడుచున్నాను కాని నాతోకూడ మిమ్ముల నుపవాసముచేయుమనుటలేదు. కాఫీ మానమనుటలేదు. తడిబట్టలు, మడిబట్టలు కట్టుకోమనుటలేదు. మీపనంతాముగిసిన తర్వాతనే నాపూజలు నేను చేసుకుంటున్నాను. దొరలుచూచి తురకలుచూచి నవ్వుటకు వాళ్ళమతములోఉన్నవి వాళ్లు ఆచరిస్తారు. పైగా ఏరూపములేని నిర్మానుష్యప్రదేశమున ఆసర్వాంతర్యామియగు పరమాత్ముని కనుగొనుటకు మనకింత భక్తిజ్ఞానము ఉదయించలేదు. మహామునులంతవారు తత్వజ్ఞానసంపాదనకై పలుకష్టములు పడుచుండగా తురకలు, దొరలు మసీదులలోను, చర్చీలలోను ప్రార్థనలు సల్పుచున్నారన్నంతమాత్రమున వారి మనస్సు భగవంతునిలోనే లీనమైయున్నవా? చిత్తం శివుడుమీద, భక్తి చెప్పులమీద అన్నట్లు నమాజు చేయాలని, ప్రార్థనచేయాలని వాళ్ళు చేస్తారుకాని భక్తిభావమరుదు. మనకింకా యీకర్మలతో కొంత మూఢభక్తిక్రింద భగవత్సంబంధమైన పనులకై తంటాలుపడిన మనస్సితరవిషయమై చింతలబడదు. పూజలచే భక్తిన్ని, మడి అనుటతో ఆరోగ్యమున్ను, నోములతో స్త్రీలబద్ధకములున్ను, పురాణపఠనములతోను భజనకాలక్షేపములతోటిన్ని శీలమున్ను బాగుపడును. ఈపండుగలగురించి ముఖ్యచరిత్రములు సనాతన

812

ముగా ఉన్నవి. క్రమక్రమముగా మీబోటివారిచే విసర్జించబడగా మిగతకొందరిచే విగ్రహారాధనగాను, పండుగలయుత్సవముల క్రిందను స్మృతిచిహ్నములుగా నిలచియున్నవి. అట్టిదే యీదసరాపండుగ. దీనికి చాలాకారణములున్నవి. మీకింగ్లీషు గ్రంథపఠనమేకాని మన మత గ్రంథములు కంటకసమానములు. మన రాముని చరిత్రకంటె మీకు ఏసుక్రీస్తుచరిత్ర యెక్కువ తెలుసును. అల్లాంటప్పుడు నేనేమి చెప్పగలను?" అంది.

"పోనీ, నీకు తెలుసునుకదా! ఈ దసరాపండుగను గురించి నాకు తెలియచెప్పుదూ. ఇదిగో చెప్పటము మరచిపోయాను. కాకినాడ మీనాన్నగారి దగ్గరనుండి మనల నిద్దరిని రమ్మని ఉత్తరం వచ్చింది. మీవాళ్లింట్లో నవరాత్రులు చేస్తారట. కలకత్తాలో బెంగాలీవాళ్లను చూచి మొదలుపెట్టేరు కాబోలును. త్వరగా పెట్టె బేడ సర్దుకో. కాకినాడలో గానసభలు జరుగుతాయి. పూజలు నీవు చూద్దువుకాని. ఉత్సవాలు, గానసభలు నేను చూస్తాను. ఏటేట గానకళవృద్ధిచేసే గాయకోత్సాహకరంబగు గానసభలు, శిల్పకళ వృద్ధిఅయే వీనుగులు విచిత్రాలంకారశోభితంబుగ విగ్రహములుకట్టి దశమిదినంబునసల్పు ఊరేగింపుటుత్సవములు మనుజుల ప్రపంచకజ్ఞానాభివృద్ధికరములు. అవి తప్పక చూచి ఆనందించి ప్రోత్సహించవలసిన కళాభివృద్ధికరములగు ఏర్పాటులు. ఈరాత్రియే ప్రయాణము." అన్నాడు శ్రీధరరావు.

* * * * *

లలిత పుట్టింటికి ప్రయాణమన్న సంతోషమున త్వరగా వంటకావించి మోటారుకు సర్దుకొని సిద్ధముగానుండెను. పదిగంటలగుసరి కిరువురు భోజనములు కావించి, పదిరోజుల వఱకు తిరిగిరారు గనుక ఇల్లంతా సర్దుకొని, వీధిగుమ్మముకు తాళమువేసి బస్సు యెక్కిరి. అమలాపురంలో శ్రీధరునకు తాలూకాకచేరిలో హెడ్డుగుమాస్తాపని. స్కూలుఫైనలు చదివేడు. సంపూర్ణపాశ్చాత్యవ్యామోహశిక్షితుడైనాడు. స్నేహాచరణముచేత కాకినాడపట్టణపుపిల్లఆయినా లలిత మతపుపట్టుదలలు కలిగి ఆచారవ్యవహారములున్న కుటుంబములోని బిడ్డ. ఏగూటిచిలుక ఆపలుకులుకదా? తండ్రివలన చిన్నతనమునుండి పురాణచరిత్రలు విని యున్నది. జాతీయవిద్యలందు నిపుణమతి. ఉభయభాషాప్రవీణురాలు. అట్టిభార్యకు నాగరికాగ్రేసరుడగు భర్తకు నడతలలో కలత లనేకములు.

వానలు వెలిసినవి. వరిచేలు బలిసినవి. బురదనీళ్లు కలకలుదేరి నిర్మలసలిలములైనవి. మబ్బులేని యెండలు. పుష్పఫలశోభితంబులగు వనములు. మేఘగర్జనములు లేక నిర్మలముగానుండునాకసము. అందలి స్వచ్ఛసంపూర్ణకాంతుల వెదచల్లుచంద్రోదయము. శరత్కాలసూచన లగపడుచున్నవి. శరత్కాలసంపూర్ణచంద్రబింబమును వర్ణించు కవులకలమునకింపగు ఋతువారంభమాయెను.

ఇట్టి ప్రకృతిశోభావిలాసము లవలోకించుచు, దారిపొడుగున నగుపడు పచ్చనిపచ్చికబయళ్లు కానందించుచు, గ్రామకాంతలు ఇండ్లకు గోడలకు సున్నపుపూతలు మట్టిపూతలు పసుపుకుంకుమలు ముగ్గులుపెట్టు పనులకులోనై ఆసులో కండిలాతిరుగుచుండుట కాశ్చర్యపడుచు సాయంకాలమునకు కాకినాడ చేరుకొనిరి.

కాకినాడలో నరసింహంగారియిల్లు గాంధినగరములో ఉన్నది. నవరాత్రులు చేయుచుండుటచే వారియిల్లు మండెరములతోడను, చిత్రవిచిత్రాదికపటములతోను, పచ్చని పందిరులతోడను, గడపల సారిద్రాకుంకుమలతోడను, చూతపత్రతోరణములతోడను, బంధుపరివారగణములతోడను కలకలలాడుచుండెను.

కూతురు, అల్లుడు వచ్చేరని తెలిసి సుందరమ్మగారు సంతోషపడుచు, మగనికి కొడుకులకు చెప్పి, ఎదురొచ్చి కాళ్లు కడుగుకొన నీళ్లిచ్చి, అల్లునిక్షేమోదంతమడిగి, పెట్టెలవీ తమపడకగదిలో పెట్టించెను. అల్లుని మర్యాదచేసి మామగారు చావడిలో పడకకుర్చీలో నాసీనులజేసిరి. బంధుస్నే[illegible]ందముతో

813

రాత్రిభోజనములైన తర్వాత ఇష్టగోష్ఠిలో, దసరాసందర్భముల ప్రస్తావనవచ్చి అల్లుడుమామల కీక్రింది సంభాషణ జరిగెను.

శ్రీధరరావు:— ఈ యుత్సవసంబంధవిషయముల నించుక చెప్పి నాసంశయముల దీర్పవేడుచున్నాను.

నరసింహంగారు:— నాయనా! ఇది అనాదిసిద్ధాచారముగా వచ్చుచున్నది. ఈ శక్తిపూజ బహుశః శాక్తేయులమతకాలమునుండి వచ్చియుండును. పూర్వపురాజులు వర్షఋతువుగడచి, తగినవాతావరణస్థితిగల నీఆశ్వయుజమాసారంభమున త్రుప్పుపట్టిన కత్తికటారుల పైకిదీసి, సేనను విల్లుసాముల నేర్పరులుగాదిద్ది కోటకంతకును కులదేవతగా నుండు ఇష్టదైవతమగు దేవినుపాసించి, పూజాదికములచే దేవీప్రీతికరముగ నుత్సవాదులొనరించి, భేరీఢంకాదివాద్యములు భోరుకొల్ప, చతురంగబలయుతులై కరితురగాదిరూఢులై విజయాభిలాషులై దశమీదినంబున దండయాత్ర వెడలెడివారట. విజయచిహ్నదినంబున నే విజయదశమియనియు, దేవినుపాసకంబగుట దేవీపూజలనియు, పదిరాత్రులుత్సవంబగుట దసరాపండుగలనియు, శివప్రీతికరంబగుట భేతాళసంబరములు, పాండవులు తమఅస్త్రశస్త్రవిసర్జనముసేయ శమీవృక్షంబుపూజించి అందు తమ ఆయుధంబులు దాచు టీరోజున నేగాన శమీపూజలు మొదలుగాగల అనేకరీతియుత్సవము లీదశదినముల జరుగును. దశదినము లాచరింపనివారు మూలపూజ మొదలుగాగల నాల్గుదినములైన చేయకమానరు. మృష్టాన్నభోజనములు, నూతనాంబరధారణములు, జనులవేడుక వెల్లువల పండుగయిది. అనాదిసిద్ధాచారము లిప్పటి నాగరికాగ్రగణ్యులచే మొదలంట నాశనమొనరింపబడినవి. ఆచిహ్నములే యిప్పటి బడిపంతుళ్లు పిల్లలచే గిలకలుపట్టించుట. సేనానాయకులు విల్లునమ్ములపాటవముచే తమసేనను తరిబీతుచేయుసందర్భము యాచనాకార్యముక్రింద దిగినది. శౌర్యకార్యములు తమాషాయుత్సవముల క్రిందను; గజతురగపదాతిచతురంగబలములు గడ్డిఏనుగులు, కర్రబొమ్మలు వాహనంబులుగాచేసి యూరేగింపుటుత్సవము దండయాత్రచిహ్నముక్రిందను నిలచియున్నది. దాని పూర్వోత్తరము లెరిగిన మన కీనవరాత్రు లవశ్యాచరణీయము.

అల్లు డంతయు వినెను. సంశయవిచ్ఛేదితహృదయుడై శ్రీధరుడంతయు గ్రహించి, తన నాగరికాభిప్రాయముల నానాడే విసర్జించి, మామగారు మొదలెట్టిన పూజలందుపాలుకొని తనభార్య ఆశ్చర్యపడునటుల యుపవాసపూజాక్రియ లొనరించుచుండెను. శ్రీధరుని క్రొత్తజన్మకు బావమరదులు, అత్తమామలు, ముఖ్యముగా లలిత వింతపడి ఆనందించిరి.

ఒకప్రక్క దేవీభాగవతము, ఒకచోట హరికథ, ఒకమూల పురాణశ్రవణములతో ఉదయాస్తమయములు లలితాసహస్రనామములతో, వేదఘోషతో, దశదినంబు లత్యంతమోదంబున బ్రహ్మాండముగా దసరాపండుగ నరశింహంగారియింట నిర్వర్తింపబడెను. ఇంటింట పూజలే. ఊరంత వేడుకలే. దశమినాడు ప్రజలెల్ల నూతనవస్త్రాలంకారులై రాత్రిజరుగు ఊరేగింపువేడుకచూచునిమిత్తము వేచియుండిరి. ఇట్లుగా వారియింట వేడుకలు ముగిసెను.

ఇక సెలవులేదని శ్రీధరుడు లలితను తీసికొని అత్తవారొసగిన కానుకల గ్రహించి, నూతనాంశములచే మేల్కొల్పబడిన ఆనందహృదయముతో సతీద్వితీయుడై ఏకాదశినాటిరాత్రికి అమలాపురము చేరిరి. లలిత కింకను తల్లిచెంతనుండెడి అభిలాషతీరలేదు. కాని భర్తయందు అనురాగిణియగుటచే పతినన్వేషించెను.

ఇట్లుగా నీదసరాపండుగ ఆసేతుహిమాచలపర్యంత మింటింట శక్త్యానుసారము భక్తిప్రదముగా నేటికిని సాగుచున్నది. ఇక నెప్పుడును లలితనోములకు శ్రీధరు డాటంకము చెప్పడు.